తళ తళ మెరిసే కత్తి

ప్రతాప రవిశంకర్

ఆ వీధిలో దీపాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. నిర్మానుష్యంగా వున్నది రోడ్డంతా....రోడ్డుకు రెండువైపులా వున్న యిళ్ళలో దీపాలు యెప్పుడో ఆరిపోయాయి.

నిశ్శబ్దంగా వున్న వీధిలోకి చిన్నగా—తాపీగా నడుస్తూ వచ్చాడతను. అతని దృష్టి రోడ్డుకు పక్కగా వున్న ఇళ్ళమీదనే వుంది.

దాదాపు ప్రతి ఇంటికీ బయట నేమ్ బోర్డులు కనపడుతున్నాయి.

అతను చప్పుడు చెయ్యని మెత్తని బూట్లు వేసుకున్నాడు.

సన్నగా వున్నాడు. అయినా బలంగా వున్నాడు. అతడి జుట్టు చిందరవందరగా వున్నది. అతడి కళ్ళు కొంచెం ఎర్రగా వున్నాయి.

కొంచెం చలిగా వుండడంవల్ల అతడి రెండు చేతులను ప్యాంటు జేబుల్లోకి దోపుకున్నాడు.

అతను ఆ వీధి చివరికి వచ్చాడు.

ఎడమవైపుగా వున్న ఆ మేడ ముందు ఆగిపోయాడు. ఎదురుగా వున్న వీధిదీపం వెలుతురులో ఆ యింటి గేటుకు వేల్లాడుతోన్న నేమ్ బోర్డు అతనికి బాగానే కనిపించింది.

యస్. రాజన్ పారిశ్రామికవేత్త.

అక్కడే నిలబడి అతను ఒక్కసారి అటూ యిటూ చూశాడు. లైటు స్తంభం వెనకవైపు బాగా చీకటిగా వున్నది. అంతే కాకుండా ఆ వెనుక వున్న యింట్లో వున్న యేదో పువ్వుల చెట్టు గోడమీదగా కిందకు వాలి వున్నది.

అతడి దృష్టి మేడమీది ఓ గదిలో వెలుగుతున్న లైటు మీద పడింది. సగంవరకు తెరిచివున్న కిటికీ అద్దాలనించి వెలుతురు బయటకు పడుతోన్నది.

అతను చేతినున్న వాచీకేసి చూసుకున్నాడు.

ఐదునిముషాలు తక్కువ పన్నెండు గంటలు కావస్తోంది.

అతను ఆలోచిస్తున్నాడు....

లోపల గదిలో రాజన్ ఏం చేస్తున్నాడు?

ఇంకా ఎందుకు దీపం వెలుగుతోంది?

లోపల అతనొక్కడే వున్నాడా? ఇంకెవరైనా వున్నారా?

నిమిషం తర్వాత అతడికి ఆ గదిలోనించి గాజులు గలగల__గ్లాసుల చప్పుడు వినిపించాయి.

అతనికి అర్థమయ్యింది.

రాజన్ గదిలో ఎవరో ఆడది వుంది.

మరో ఇరవై నిముషాలు గడిచాయి.

కొంచెం దూరంలో మెయిన్ రోడ్డు మీద వున్నట్టుండి సందడి మొదలయ్యింది.

సెకండ్ షో సినిమా వదిలినట్టున్నారు. మనుషులు మాట్లాడుకొంటూ వెళుతున్న సందడి వినిపిస్తోంది. వాహనాలు రివ్వున దూసుకు వెళుతున్న చప్పుడవుతోంది.

ఇంకా మేడమీది గదిలో దీపం ఆరిపోలేదు.

అతడికి విసుగనిపించింది.

ఇంకో పది నిముషాలు అవలీలగా గడిచిపోయాయి.

సందడి కూడా తగ్గిపోయింది.

చీకట్లోనించి రెండు అడుగులు ముందుకు వేశాడు.

ప్యాంటు జేబులో చెయ్యి పెట్టాడు.... పొడుగాటి కత్తి చేతికి తగిలింది.

అతను గబగబా ముందుకు నడిచి ప్రహరీ గోడదగ్గరకు వెళ్ళాడు.

గోడమీద చేతులు ఆనించి నిముషంలో లోపలకు దూకాడు.

అతడి అదృష్టం.... ఆ మేడమీదకు బయటనించి కూడా మెట్లు వున్నాయి.

తోటలో చెట్లు గాలికి తలలు వూపుతున్నాయి అక్కడ దీపం లేకపోవటం వల్ల అంతా చీకటిగా వున్నది.

మెట్లెక్కి పైకి చేరుకున్నాడు. మెట్ల పక్కనే వున్న గదిలోనే దీపం వెలుగుతోంది.

అద్దాలకిటికీ తలుపుల మధ్యనించి లోపలి దృశ్యం కనపడుతోన్నది.

రాజన్ సోఫాలో కూర్చునివున్నాడు. అతడి పక్కనే

ఓ యువతి అర్ధనగ్నంగా వుండి అతడి గ్లాసులో విస్కీ వొంచి పెదవులకు అందిస్తోంది.

అతను ఆమె భుజాలను నిమురుతున్నాడు.

ఆమె నవ్వుతోంది కిల కిలా—

ఉన్నట్టుండి అతను ఆమె పెదవులను అందుకుని ముద్దు పెట్టుకున్నాడు....

చిన్నగా అరిచింది ఆమె—

"నీ పెదవుల్లో అమృతం వుంది." అన్నాడు....

"మైకంలో అలాగే అనిపిస్తుంది....తర్వాత మీకు నేనసలు గుర్తే వుండను" అన్నది....

"డోంట్ బి సిల్లీ....నువ్వు ఎప్పుడూ నా గుండెల్లోనే వుంటావు....యిది నిజం" గ్లాసులో విస్కీని గొంతులోకి వంచుకుని ఆమెకు గ్లాసును అందిస్తూ అన్నాడు రాజన్....

"అదే నిజమైతే నేను యిప్పటికీ ఓ ఫ్లాటులో అద్దెకు వుండాల్సిన అవసరం యెందుకు వుంటుంది?" అతడి కళ్ళలోకి చూస్తూ అన్నదామె—

అతను యేదో మాట్లాడబోయాడు.

కాని ఇంతలోనే ఆ గది తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. అతను లోపలకు అడుగుపెట్టి వెంటనే తలుపులను మూశాడు.

ముందుగా—అతడిని చూసిన ఆమె భయంతో బిగుసుకుపోయింది.

అతడి చేతిలో పొడవాటి కత్తి వున్నది. ఆ కత్తి చాలా పదునుగా వుంది. తళతళమని మెరుస్తోంది. దాని పిడి నల్లగా వుంది.

రాజన్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి.

మైకంతో మాతలు పడుతున్న కళ్ళను బాగా తెరిచి చూశాడు....

ఎదురుగా—మృత్యువులా నిల్చుని వున్న అతను—కత్తి పట్టి బిగుసుకున్న అతడి చెయ్యి.

క్షణం తర్వాత అతడి నోరు పెగిలింది.

"ఎవరు నువ్వు?" అడిగాడు రాజన్.

నవ్వాడు అతను అదోలా—

నవ్వి "నే నెవరో నీకు చెప్పిన వెంటనే గుర్తు రాదు. ఒక్కటిమాత్రం నిజం.... నేనే నీ పాలిట మృత్యువును" అన్నాడు.

అప్పుడు రాజన్ కళ్ళలో భయం కనపడింది. ఆ యువతి కవ్వున అరవబోయింది.

"ష్....అరవకు....తెరిచిన నోరు మూసుకోక ముందే నీ ప్రాణాలు పైకిపోతాయి. ఈ కత్తి ముందుగా నీ గుండెల్లోకి దూసుకుపోతుంది" అన్నాడతను వేగంగా—

అంతే....ఆమె పెదవుల మధ్యనించి శబ్దం బయటకు రాలేదు.

"నువ్వెవరో నాకు తెలీదు....నేను నీకు యెలాంటి ద్రోహమూ చెయ్యలేదు" అన్నాడు రాజన్ గొంతు పెగుల్చుకుని....

అతను మళ్ళీ నవ్వి "నే నెవరో నీకు తెలియక పోయినా నువ్వెవరో నాకు తెలుసు....రాజన్ అంటే నువ్వే కదూ?" అన్నాడు.

అవునన్నట్లు తలాడించాడు.

"అయితే నువ్వే నాకు కావలసిన మనిషివి....నిన్ను హింసించి చంపటమే నా ధ్యేయం."

"వద్దు .. నన్నేమీ చెయ్యొద్దు....ఇంతకీ నువ్వెవరు?

నువ్వెవరివో చెప్పకుండా నన్ను చంపుతానని బెదిరించటం న్యాయమేనా?" అన్నాడు రాజన్ ఎలాగైనా అతడి నించి తప్పించుకోటానికి ఆలోచిస్తూ—

"హు ... న్యాయం.... న్యాయం.... న్యాయం గురించి మాట్లాడే అర్హత నీకు లేదు. మరోసారి నువ్వు న్యాయం అంటే నీ నాలుక కోసేస్తాను....నువ్వెంత దుర్మార్గుడివో నాకు తెలుసు....నీతో కబుర్లు పెట్టుకుని టైము వేస్టు చెయ్యటానికి రాలేదు" అని ప్యాంటు జేబులోనించి నైలాన్ తాడును బయటకు తీశాడు.

ఆ తాడును ఆ యువతికి ఇచ్చి రాజన్ రెండు చేతులనూ వెనక్కి విరిచి కట్టెయ్యమన్నాడు.

ఆమె భయంతో అతను చెప్పినట్టే రాజన్ని కట్టేయబోయింది....

"యూ ఫూల్ ....నువ్వు నన్నే కట్టేస్తావా?" అన్నాడు రాజన్ కోపంగా అక్కడినించి లేవటానికి ప్రయత్నం చేస్తూ.

"కదలకు రాజన్ .... నేను పాము లాంటివాడిని.... క్షణంలో నిన్ను అంతం చేస్తాను....నువ్వు ఎన్ని ప్రయత్నాలు చేసినా నా నించి తప్పించుకోలేవు. చెప్పాను కదూ? నిన్ను ఒక్కసారిగా చంపను. భయపెట్టి, హింసించి నెమ్మదిగా చంపుతాను...."

ఆ యువతి రాజన్ చేతులు కట్టేసింది. తర్వాత ఆ యువతి చేతులను వెనక్కి వంచి అతను కట్టేశాడు. టేపు బయటకు తీసి యిద్దరి పెదవులకూ అంటించాడు....

ఆ యువతి కళ్ళలోనించి నీళ్ళు బయటకు వచ్చి

చెక్కిళ్ళమీదకు కారాయి....

"భయపడకు....నిన్నేమీ చెయ్యను....నా జాగ్రత్త కోసం ఇలా చేశాను....సారీ...." అంటూనే అతను కత్తిని అందుకున్నాడు....

"డియర్ రాజీవ్....జీవితంలో నువ్వు పదునైన కత్తి పోటును ఎప్పుడూ తినలేదేమో....ఇదిగో ఇలా వుంటుంది. రుచి చూడు" అంటూ కత్తిని విసురుగా రాజన్ భుజంలోకి దించేశాడు.

కవ్వుమన్నాడు రాజన్.

నోటికి టేపు వుండటంతో శబ్దం బయటకు రాలేదు. మూలుగు వచ్చింది.

ఆ యువతి అదిరిపడింది.

కత్తి సగంవరకు దిగిపోయింది.

నెత్తురు రివ్వున బయటకు చిమ్మింది.

క్షణాల్లో షర్టంతా తడిసిపోయింది.

రాజన్ కళ్ళలో నీళ్ళు వచ్చాయి....

సోఫాలో పక్కకు పడిపోయాడు....

అతడికి నిమిషంలో స్పృహపోయింది.

బయటకు లాగిన కత్తికి అంటిన నెత్తురును రాజన్ షర్టుకే తుడిచాడు అతను.

తర్వాత ఆ యువతి చేతికట్లు విప్పదీసి "నేను వెళ్ళిపోయిన పది నిముషాలకు డాక్టర్‌కు ఫోన్ చెయ్యి....పది నిముషాలలోపల నువ్వు నోరు విప్పితే నిన్ను ప్రాణాలతో వదలను" అని అక్కడినించి బయటకు వచ్చి మెట్లు దిగి కిందికి వచ్చాడు.

గోడ దూకి రోడ్డుమీదకు వచ్చాడు.

2

రూప 'సిల్కు కళామందిరం'లో నించి చేతిలో ప్యాకెట్టుతో బయటకు వచ్చింది. వయ్యారంగా నడుస్తూ రోడ్డు పక్కనే పార్కు చేసి వున్న ఎరుపురంగు ఫియట్ కారు దగ్గరకు నడిచింది.

ఆమె అందమైన కళ్ళు నిర్మలంగా వున్నాయి. ఆమె షిఫాన్ చీర కట్టుకుంది. స్లీవ్ లెస్ బ్లవుజు వేసుకున్నది. పాదాలకు హైహీల్ చెప్పులు.

కుడిచేతికి ఎలక్ట్రానిక్ గడియారం....

ఆమె చేతిలోవున్న ప్యాకెట్టును వెనుక సీట్లోకి చిన్నగా విసిరి ముందు డోర్ తెరిచి స్టీరింగ్ వీలు ముందు కూర్చుంది.

సరిగ్గా అప్పుడే—అప్పటివరకూ రోడ్డుకు అవతల వున్న ఖాళీ ప్రదేశంలో ఓ చెట్టుకింద నిలబడిన అతను గబగబా ఆమె దగ్గరకు వచ్చాడు.

వచ్చి "ఎక్స్‌క్యూజ్ మి మేడమ్" అన్నాడు....

ఆమె అతడికేసి ఆశ్చర్యంగా చూసి "ఎవరు మీరు? యేం కావాలి?" అని అడిగింది కనురెప్పలను టపటప లాడిస్తూ—

"మీరు లక్షాధికారి జనార్దనంగారి అమ్మాయే కదూ" అని అడిగాడు.

"అవును....అయితే యేమిటి?"

"మీ పేరు?"

"రూప...." అంటూనే ఆమె ఫియట్‌ను స్టార్టు చేసింది.

"నేను మీతో ఓ ముఖ్యమయిన విషయం గురించి మాట్లాడాలి రూపగారూ....మీకు అభ్యంతరం లేకపోతే

మీ కార్లో కొంతవరకు నేను కూడా వస్తాను" అన్నాడు అతడు ఇంగ్లీషులో—

ఒక్కసారి రూప అతడి కళ్ళలోకి చూసింది. చాలా మామూలుగా వున్నాయి అతడి కళ్ళు—అతడి మాటల్లో సభ్యత—గౌరవం ఆమె గ్రహించి "దయచేసి యే విషయం గురించి మాట్లాడాలో చెబుతారా....?" అన్నది.

"మీ నాన్న గురించి....ఆయన గురించి మీతో ఓ సంగతిని చెప్పాలి....యిక్కడ దగ్గరలో ఓ పార్కు కూడా లేదు. అందుకని మనం కార్లో వెళుతూ మాట్లాడుకోవటమే బావుంటుంది."

క్షణం ఆలోచించి "ఆల్ రైట్....రండి...." అన్నది రూప.

ఆమెకు థాంక్స్ చెప్పి, అతను బ్యాక్ డోర్ తెరుచుకుని ఫియట్ లో ఎక్కాడు.

వెంటనే కారు బాణంలా రివ్వున ముందుకు దూకింది.

"దయచేసి కారును వీలయినంత నెమ్మదిగా నే పోనివ్వండి" అన్నాడతను.

"ఎందుకు? మనం మా యింటికి వెళ్ళయినా మాట్లాడుకోవచ్చు.. మా డాడీకి సంబంధించిన విషయం అన్నారు కాబట్టి ఆయనతో కూడా మాట్లాడవచ్చు" అన్నది రూప వేగం తగ్గించకుండానే.

"ప్లీజ్ .... నేను చెప్పినట్టు చెయ్యండి .... నేను చెప్పిన విషయాన్ని మీ నాన్నాతో మీరు చెబితేనే బావుంటుంది...."

"ఆల్ రైట్....అలాగే....మీరు చెప్పినట్టే చేస్తాను. ముందు మీరు చెప్పదల్చుకున్నదేమిటో చెప్పండి" అన్నది

స్పీడు తగ్గిస్తూ.

"నేను మీకు ఎలా కనిపిస్తున్నాను?" అడిగా డతను వెంట నే—

ఆమె ఆశ్చర్యపడింది. ఎందుకంటే ఆమె అతనలా అడుగుతాడని వూహించలేదు.

"మంచి మనిషిలా సంస్కారవంతుడిలా అగుపడుతున్నారు" అని చెప్పింది.

అతను నవ్వాడు.

"నిజమే .... నేను సంస్కారవంతుడి నే .... కాని యిప్పుడు నేను రాక్షసుడిని. త్వరలో హంతకుడిని కూడా కాబోతున్నాను" అన్నాడు నవ్వటం ఆపేసి....

సడన్‌గా కారుకు బ్రేకు వేసింది రూప.

"ప్లీజ్ .... బ్రేకు వెయ్యకండి....మీరు భయపడవలసిన అవసరం లేదు. నేను మంచివాళ్ళకు మంచివాడి నే...."

మళ్ళీ ఫియట్ ముందుకు దూకింది.

"ఇంతవరకు నేను ఒక్క హత్య కూడా చెయ్యలేదు. కాని త్వరలో నే కొన్ని హత్యలు చెయ్యబోతున్నాను. అందులో మీ నాన్న కూడా వున్నాడు."

రూప వులిక్కిపడి మళ్ళీ బ్రేకు నొక్కింది.

"ప్లీజ్ ....కారును పోనివ్వండి....ఇంకా వివరంగా చెప్పాలి."

ఆమె అప్రయత్నంగా నే యాక్సిలేటర్ మీద కాలును నొక్కుతూ "మీరు నిజంగా నే మాట్లాడుతున్నారా? జోక్ చేస్తున్నారా?" అని అడిగింది.

"జోక్‌లా వుంటే నవ్వండి....కాని యిది నిజం.... అయితే హత్య చెయ్యదల్చుకున్న మనిషి ముందుగా ఆ

విషయాన్ని యెవరికీ చెప్పడు. కాని నేను అలా కాదు. మీ నాన్నను ఒక్కసారిగా చంపటం నా ధ్యేయంకాదు. భయపెట్టి—హింసించి మరీ చంపుతాను. అందువల్ల నే ముందుగా చెబుతున్నాను."

రూప మొహం నిండా చెమట పట్టింది. చేతులు చిన్నగా వణికాయి.

ఎదురుగా వున్న మిర్రర్ లో అతడి రూపం క్లియర్ గా అగుపడుతోంది. ఇప్పుడు అతని కళ్ళలో ఆమెకు కార్య దీక్ష—పట్టుదల ఓ విధమయిన గట్టి నిర్ణయం కనిపించాయి.

అతను జోక్ చెయ్యటంలేదని అనుకుంది.

క్షణం తర్వాత ఎలాగో నోరు తెరచి "మా నాన్న మీద మీ కెందుకు కోపం? ఆయన్ని హత్య చెయ్యాలని మీ రెందుకు అనుకుంటున్నారు?" అన్నది.

"సారీ.... మీ ప్రశ్నలకు నేను జవాబులు చెప్పను. ఏ కారణమూ లేకుండా ఓ మనిషిని హత్య చెయ్యాలని అనుకోటానికి నా మతి చలించలేదు. నేను పూర్తి ఆరోగ్యంగా వున్నాను. నాదో రిక్వెస్టు.... మీరు యింటికి వెళ్ళగానే ఓ మనిషి ఆయన్ని హత్యచెయ్యటానికి పొంచి వున్నట్టుగా చెప్పండి. ఆయన చేసిన నేరం యేమిటో ఆయన్నే అడగండి...." అన్నాడతను.

రూప మాట్లాడలేదు.

అలోచిస్తూనే ఎదురవుతున్న వాహనాలను తప్పుకుంటూ జాగ్రత్తగా డ్రయివ్ చేస్తోంది.

ఎవరీ మనిషి?

ఎందుకు తన తండ్రిమీద పగబట్టాడు?

నిజంగా ఆయన్ని హత్య చేస్తాడా?

ఇంత ధైర్యంగా యెందుకు చెబుతున్నాడు? తనని యెవరైనా పట్టుకుంటారనే భయంలేదా?

ముందుగా చెబితే తగిన జాగ్రత్తలు తీసుకొంటారనే ఆలోచన రాలేదా?

ఏమిటిదంతా?

ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ "ఒక్కసారి ఇలా చూడండి" అన్నాడు.

తలతిప్పి చూసింది రూప.

అతడి చేతిలో తళతళమని మెరుస్తున్న పొడుగాటి నల్లని పిడివున్న పదునైన కత్తి.

"ఈ కత్తి త్వరలోనే పిడివరకూ సూటిగా మీనాన్న గుండెల్లో దిగబడుతుంది."

భయంతో చిన్నగా అరిచింది రూప.

కారు సడన్ బ్రేకుతో ఆగిపోయింది.

"థాంక్ యూ రూపా" అని అతను ఆమె వూహించనంత వేగంగా డోర్ తెరుచుకొని కిందికి దూకాడు.

రూప భయంనించి తేరుకొని చూసేసరికి అతను జనంలో కలిసిపోయాడు.

3

"రండి .... ఇన్ స్పెక్టర్ ...." అని ఆహ్వానించాడు స్వరూప్. అతను రాజన్ కొడుకు. ఇంజనీరింగ్ చదువుకొన్నాడు.

పోలీసు ఇన్ స్పెక్టర్ జగన్ లోపలకు వచ్చాడు.

అది ప్రయివేటు నర్సింగ్ హోం. అందులో వున్న ఓ గదిలో బెడ్ మీద మూలుగుతూ పడివున్నాడు రాజన్.

లోపలకు వచ్చిన ఇన్ స్పెక్టర్ ని చూడగానే అతడి బాధ మరింత యెక్కువయ్యింది.

అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నాడు ఇన్ స్పెక్టర్ జగన్.

అప్పుడు ఉదయం తొమ్మిది గంటలయ్యింది.

రాజన్ భుజానికి బ్యాండేజితో పెద్ద కట్టు వున్నది.

రాజన్ కు ఓ గంట క్రితమే స్పృహ వచ్చింది.

ఆ రాత్రి అతను వెళ్ళిపోగానే ఆ యువతి కూడా ఎవరినీ పిలవకుండానే తన నివాసానికి వెళ్ళిపోయింది— పోలీసులను పిలిస్తే ఆ గొడవలో తను కూడా ఇరుక్కోవలసి వస్తుందని—

తెల్లారుజామున రాజన్ కొడుకు స్వరూప్ ఏదో ఊరు వెళ్ళి వచ్చేవరకు అతనలా పడేవున్నాడు.

అప్పుడు అతను కార్లో డాక్టర్ దగ్గరకు తీసుకొని వచ్చాడు.

"ఏమయ్యింది?" అడిగాడు జగన్.

నెత్తురు చాలావరకు కారిపోయి రాజన్ పరిస్థితి దయనీయంగా వున్నది. ఇంకో గంటలోపల అతడికి నెత్తురు ఎక్కించటం జరక్కపోతే అతను స్పృహ రాకుండానే ప్రాణాలు పోగొట్టుకొనేవాడని డాక్టర్ వ్రజదంతం అన్నాడు.

రాజన్—ఇన్ స్పెక్టర్ కు చెప్పిన మాటల సారాంశం ఇది.

'రాత్రి నేను నిద్రపోతుంటే ఎవరో తలుపు తట్టారు. తెరిచేసరికి యెవరో సన్నగా వున్న యువకుడు లోపలకు వచ్చి, తనని చంపుతానని బెదిరించి, వెంటనే కత్తితో భుజంమీద బలంగా పొడిచి పారిపోయాడు. వెంటనే తనకు స్పృహ తప్పింది.'

"ఆశ్చర్యంగా వుంది? యెవరా మనిషి? అతనికి

మీ మీద యెంతో పగ—కసి వున్నాయని ఈ సంఘటన వల్ల చాలా క్లియర్‌గా తెలుస్తోంది. చెప్పండి. ఎవరతను? అతన్ని ఇంతకుముందు యెప్పుడయినా చూశారా? అతను మీ మీద పగబట్టటానికి కారణం ఏమిటి?" అని అడిగాడు జగన్.

డాక్టర్ వజ్రదంతం దగ్గి, "పేషంట్ చాలా నీరసంగా వున్నాడు. ప్రస్తుతానికి అతడిని మాట్లాడించటం అంత క్షేమం కాదు. దయచేసి ఈ ఒక్క రోజు ఓపిక పట్టండి. రేపటికి కొంచెం కోలుకోవచ్చు" అన్నాడు.

జగన్ విసుక్కున్నాడు.

"డాక్టర్....ఆలస్యం చేస్తే ఆ ప్రతీకార హంతకుడు తప్పించుకొనే అవకాశాలు ఎక్కువ అవుతాయి. అతడిని వెంటనే పట్టుకోవాలంటే నేనడిగిన ప్రశ్నలకు జవాబులు కావాలి...."

రాజన్ చిన్న గొంతుతో "ఇన్‌స్పెక్టర్! ముందు మీరు ఆ మనిషిని పట్టుకొనే ప్రయత్నం చెయ్యటం ఎంతయినా ముఖ్యం. ఎందుకంటే అతను మళ్ళీ వచ్చి నన్ను గాయపర్చవచ్చు. లేదా ప్రాణం తీయవచ్చు.... అతడి గురించిన వివరాలు నేను ఇస్తాను" అని యెలాగో మూలుగుతూనే అతడిని వర్ణించి చెప్పాడు రాజన్—ఓవైపు డాక్టరు గోకవపెడుతున్నా.

అన్నింటినీ చిన్న బుక్‌లో నోట్ చేసుకొని "థాంక్‌యూ మిస్టర్ రాజన్..ఇక మీరు నిశ్చింతగా వుండండి. ఆ హంతకుడిని పట్టుకొనే ప్రయత్నాలు మొదలు పెడతాం. అతను యెక్కడికీ పోలేడు. మరో విషయం. రేపు ఉదయం మిమ్మల్ని నేను మళ్ళీ కలుస్తాను. అప్పటికి ఈ మనిషి మిమ్మల్ని హత్య చెయ్యటానికి ప్రయత్నించ

టానికి తగిన కారణం ఏదయినా గుర్తుకొస్తే నాతో చెప్పేందుకు సిద్ధంగా వుండండి. దయచేసి ఏదీ దాచవద్దు. అలా చేస్తే మీకే ప్రమాదం.... బై" అని బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్ జగన్.

"డాక్టర్ ఏమిటిదంతా? నాకెందుకో భయంగా వుంది" అన్నాడు స్వరూప్ ఇన్‌స్పెక్టర్ వెళ్ళగానే—

"భయపడకు బోయ్.... నా శాయశక్తులా కృషిచేసి మీ ఫాదర్‌ని బతికిస్తాను" అన్నాడు డాక్టర్ వజ్రదంతం.

"మీరు బతికిస్తారు నిజమే డాక్టర్. కాని మళ్ళీ ఆ పగబట్టిన మనిషి మా నాన్నను హత్య చెయ్యటానికి మరో సారి ప్రయత్నం చెయ్యొచ్చు కదా!" అన్నాడు.

"నిజమే. ఇందుకు నువ్వు తగిన జాగ్రత్తలు తీసుకోక తప్పదు. అయినా నాదో అనుమానం. మిస్టర్ రాజన్ ఆ యువకుడికి చేసిన ద్రోహం యేమిటి? ముందు మనం ఈ విషయం తెలుసుకుంటే మంచిది."

"కరెక్టు డాక్టర్.... నాన్నను ఈ విషయం గురించి అడగాలి" అన్నాడు స్వరూప్.

"సారీ మిస్టర్ స్వరూప్. ఈ పరిస్థితిలో మీ ఫాదర్‌ను యెక్కువగా మాట్లాడించటానికి డాక్టర్‌గా నేను ఒప్పుకోను" అంటూ వెనక్కు తిరిగాడు వెళ్ళి పోయాడు.

గదిలోపల రాజన్ బాధగా చిన్నగా మూలుగు తున్నాడు.

4

జనార్దనం ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

అతడి యెదురుగా సోఫాలో రూప కూర్చుని వున్నది.

ఆమె తండ్రికి కార్లో ఎక్కి తనని భయపెట్టిన అతడి గురించి వివరంగా చెప్పింది.

రెండు నిమిషాల తర్వాత "అతను జోక్ చేశాడేమో" అన్నాడు.

"కాదు డాడీ. అతను జోక్ చెయ్యటం లేదని కూడా చెప్పాడు. నేనూ అప్పుడు నీలాగే అనుకున్నాను. కాని అతడిని చూస్తే ప్రాక్టికల్ మనిషిలాగానే అనిపించాడు."

"రియల్లీ వండర్....బహుశా అతను పొరపాటుపడి వుంటాడు. జనార్దనం పేరు వున్న లక్షాధికారులు ఈ మహానగరంలో ఎంతమంది లేరు. నువ్వు పొరపాటు చేశావు. అతన్ని వివరాలు అడిగి వుంటే బావుండేది."

"అడిగాను డాడీ....కాని అతను ఏమీ చెప్పనని అన్నాడు. అతను పొరపాటుపడి వుంటాడని కూడా నేను అనుకోను. ఎందుకంటే ఓ మనిషిని హత్యచెయ్యాలని ఎవరైనా అనుకున్నప్పుడు తనకు కావలసిన మనిషి అతనో కాదో పూర్తిగా రుజువు చేసుకున్న తర్వాతనే నిర్ణయించు కుంటారు. అందుకే నాకు ఇప్పుడు భయంగా వుంది డాడీ....దయచేసి నువ్వు బాగా గుర్తుచేసుకో. నీకు తెలిసి కాని పొరపాటునగాని యెవరికయినా ద్రోహం చేశావేమో" అన్నది రూప.

ఆమె కళ్ళలో నీళ్ళు వచ్చాయి భయంతో—ఇంకా ఆమె కళ్ళముందు అతడి రూపం— అతడు చూపిన తళతళ మెరిసే పొడుగాటి కత్తి కదులుతూనే వున్నాయి.

"లేదు రూపా .... యెంత ప్రయత్నం చేసినా నేను ఎవరికీ ద్రోహం చేసినట్టు గుర్తు రావటంలేదు. ఆలో చిస్తుంటే నాకు మతి పోతోంది. చీమకు కూడా

అపకారం చెయ్యని నన్ను హత్య చెయ్యటానికి ఓ చదువుకున్న యువకుడు ప్రయత్నం చేస్తున్నాడంటే నమ్మలేక పోతున్నాను. ఒకవేళ అతను మతిలేని మనిషేమోనని నాకు అనుమానంగా వుంది" అన్నాడు జనార్దనం.

"కాదు డాడీ....అతను పూర్తిగా మన లోకంలోనే వున్నాడు. పైగా అతను ఎంత పగలేనిదే మీ తండ్రిని హత్య చెయ్యాలని అనుకుంటాను అని కూడా అన్నాడు. దాన్నిబట్టి తప్పకుండా నువ్వు అతడికి ఏదో అన్యాయం యెప్పుడో చేసివుండాలి అనిపిస్తోంది. ప్లీజ్ .... డాడీ.... బాగా గుర్తుచేసుకో..ఎప్పుడయినా...ఎన్నేళ్ళక్రితమైనా నువ్వు ఏ మనిషికయినా ద్రోహం చేశావేమో....ఒకవేళ నువ్వు అలాంటిది యేదయినా చేసివుంటే అతడిని నేను క్షమాపణ అడుగుతాను" అన్నది రూప వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"రూపా ...." అన్నాడు జనార్దనం బాధగా. అతడికీ కన్నీళ్ళు వచ్చాయి.

"బాధపడకు రూపా .... నిజంగానే నేను నాకు తెలిసి ఎలాంటి అన్యాయమూ చెయ్యలేదు. అయినా అతను నామీద పగబట్టాడంటే అది నా దురదృష్టం.... ఐతే అతను నా యెదురుగా వస్తే తను పొరపాటు పడ్డాడని సులభంగా గ్రహించగలడనే నమ్మకం నాకు వుంది."

"నిజమే డాడీ. నాకూ ఆ నమ్మకం వుంది. ఏమయినా మనం మన జాగ్రత్తలో వుండాలి. ఈ విషయాన్ని మనం పోలీసులకు తెలియజేయటం ఎంతయినా మంచిది" అన్నది రూప.

"అవును. ఇప్పుడే మనం ఇన్‌స్పెక్టర్ని కలుద్దాం"

అని లేచి నిల్చున్నాడు జనార్దనం.

రెండు నిమిషాల తర్వాత వాళ్ళిద్దరూ పోలీసుస్టేషన్ కు బయల్దేరారు.

5

ఇన్ స్పెక్టర్ జగన్ కారు దిగి లోపలకు వస్తున్న జనార్దనాన్నీ—రూపనీ చూసి "రండి....రండి" అని నవ్వుతూ లోపలకు ఆహ్వానించాడు.

ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్న తర్వాత "చెప్పండి. మీరు యేదో అవసరమయిన పనిమీద నే వచ్చారని అనుకుంటున్నాను" అన్నాడు జగన్.

"అవును ఇన్ స్పెక్టర్. ముఖ్యమైన విషయం చెప్పటానికే వచ్చాం" అంటూ విషయాన్నంతా అతడికి వివరంగా చెప్పేశాడు జనార్దనం.

వెంటనే ఇన్ స్పెక్టర్ కొయ్యబారి పోయాడు.

ఒక్క నిమిషం తర్వాత "మై గాడ్...ఐతే మీరు నిజంగానే గొప్ప ప్రమాదంలో వున్నారు" అన్నాడు.

"ఏమిటి ఇన్ స్పెక్టర్ మీరనేది?" అని అడిగింది రూప.

అప్పుడు జగన్ ఆ మనిషి రాజన్ భుజంలోకి కత్తిని దించి చేసిన గాయం గురించి వివరంగా చెప్పాడు.

భయంతో తండ్రీ కూతుళ్ళు మొహాలు చూసుకున్నారు.

"రెండు కేసులూ ఒక్కటే—వర్ణనుబట్టి మీ ఇద్దరినీ ఒకే వ్యక్తి హత్య చెయ్యటానికి కంకణం కట్టుకున్నాడు. ఇంతకీ మీకు పారిశ్రామిక వేత్త రాజన్ గారితో పరిచయం వున్నదా?" అనడిగాడు జగన్.

"లేదు. అతన్ని ఎప్పుడో యేదో మీటింగ్ లో ఒక్క

సారి చూశాను. అంతే" అన్నాడు జనార్దనం.

"వింతగా వుంది. ఇద్దరు అసిపరుల్ని ఓ యువకుడు ఎంతో ప్రతీకారంతో హత్య చెయ్యటానికి పూనుకున్నాడంటే నిజంగా ఇందుకు తగిన కారణం యేదో వుండే వుంటుంది. కాని మీరిద్దరు ఆ కారణాన్ని మరచిపోయి వుంటారు. ఒక్కసారి బాగా గుర్తుచేసుకోండి. ప్లీజ్" అన్నాడు జగన్.

"సారీ ఇన్‌స్పెక్టర్...ఎంత గుర్తుచేసుకున్నా నాకు ఏమీ గుర్తురావటంలేదు. నన్నో మనిషి హత్యచేసేంతటి ద్రోహాన్ని నేను ఎవరికీ చెయ్యలేదు" అన్నాడు జనార్దనం.

"ఆల్‌రైట్. అతను పొరపాటు పడ్డాడనే అనుకుందాం. అయినా మీరు మీ ప్రాణాలను గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని రోజులపాటు మీరు ఒంటరిగా ఎక్కడికీ తిరగకండి. కొత్త వ్యక్తులను పూర్తిగా చెక్ చేయించకుండా మీ ఇంట్లోకి రానివ్వకండి."

"నా జాగ్రత్తలు నేను తీసుకుంటాను. కాని నాకు కొన్నాళ్ళపాటు పోలీసు ప్రొటెక్షన్ కావాలి."

"గుడ్. అలాగే. ఈ రోజునించే రాత్రి యేడు గంటలనించి మీ ఇంటి బయట తెల్లవారేవరకూ ఓ కానిస్టేబుల్ కాపలా వుంటాడు. పగటిపూట మీరు జాగ్రత్తగా వుండండి."

"థాంక్ యూ ఇన్‌స్పెక్టర్. యిప్పుడు నాకెంతో ధైర్యంగా వుంది. బయట ఓ పోలీసు మనిషి కాపలా వుంటే ఆ మనిషి లోపలకు రావటానికి ప్రయత్నం చేస్తాడని నేను అనుకోను. వెళ్ళొస్తాం" అని లేచి నిల్చు

న్నాడు జనార్దనం.

రూప కూడా నిల్చుంది.

వెళుతున్న వాళ్ళని చూసి భారంగా నిట్టూర్చాడు ఇన్ స్పెక్టర్ జగన్.

6

నాలుగు రోజుల తర్వాత—

తన ఇంట్లోనే బెడ్ మీద పడుకొనివున్నాడు రాజన్. ఆయన నీరసంనించి కోలుకున్నాడు కాని-అతనికి ప్రాణ భయంవల్ల బలహీనంగా కనపడుతున్నాడు.

అంతకుముందు రెండు రోజులక్రితమే ఇన్ స్పెక్టర్ జగన్ వచ్చి ఆ మనిషి పగబట్టడానికి కారణం యేమిటో చెప్పమని వేధించి వెళ్ళిపోయాడు.

ఇన్ స్పెక్టర్, రాజన్ తో—జనార్దనంకి వచ్చిన బెదిరింపు గురించి, అతను పోలీసు ప్రొటెక్షన్ అడిగిన విషయాన్ని కూడా చెప్పాడు.

రాజన్ ఆశ్చర్యపోక తప్పలేదు.

ఆ మనిషి లక్షాధికారి జనార్దనంమీద కూడా పగ బట్టాడా? అతడిని కూడా చంపుతానని బెదిరించాడా?

ఇంతకీ అతను ఇలా పగబట్టడానికి కారణం యేమిటి?

ఎంత ఆలోచించినా రాజన్ కి గుర్తుకు రాలేదు. కాని యేదో ఓ కారణం వుందే వుంటుందని అతని అంతరాత్మ ఓ వైపు గొడవపెడుతూనే వుంది.

అయితే—యేమిటా కారణం?

రాజన్ విపరీతమైన ఆలోచనలలో మునిగిపోయినప్పుడే నౌకరు రంగన్న పైకి వచ్చాడు. అతడి చేతిలో రెండు ఉత్తరాలు వున్నాయి.

అందులో మొదటి ఉత్తరం ఎవరో ఓ స్నేహితుడి

దగ్గరినించి యేదో బిజినెస్ విషయమై రాసింది.

రెండో ఉత్తరం—

చదువుతుంటే రాజన్ చేతులు వణికాయి. అందులో ఈ విధంగా వున్నది.

డియర్ రాజన్

నువ్వు కొంచెం కోలుకున్న తర్వాత నే మళ్ళీ నీ దగ్గరకు రావాలనుకున్నాను. యిప్పుడు నీ ఆరోగ్యం కొంచెం మెరుగయిందనుకుంటాను. త్వరలోనే నా పదునైన కత్తి నీ శరీరంలో దిగబడుతుంది. నువ్వు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నా కత్తి దెబ్బనించి తప్పించుకోలేవు. ఇది నిజం. నువ్వు చెయ్యగలిగింది ఒక్కటే. అదే చావుకోసం ఎదురుచూడటం

డై—నీ పాలిట మృత్యువు.

సరిగ్గా అప్పుడే రాజన్ కొడుకు స్వరూప్ పైకి వచ్చాడు. తండ్రి చేతిలోని ఉత్తరాన్ని అతను కూడా చదివాడు.

"డర్టీ డెవిల్. ఈసారి వీడు ఈ ఇంట్లో అడుగు పెట్టాడంటే ప్రాణాలతో బయటకు వెళ్ళలేడు" అన్నాడు పళ్ళు కొరికి.

"స్వరూప్....నువ్వు వెంటనే వెళ్ళి ఇన్‌స్పెక్టర్ని కలుసుకో. అతనికి ఈ ఉత్తరం చూపించి నాక్కూడా పోలీసు ప్రొటెక్షన్ యేర్పాటు చెయ్యమని చెప్పు" అన్నాడు.

తలవూపి స్వరూప్ వెళ్ళిపోయాడు.

రాజన్ మనసులో దేవుడ్ని ప్రార్థిస్తున్నాడు. ప్రాణభయం అతడిలో బయల్దేరింది. కళ్ళముందు పదునైన

అతడి చేతిలోని కత్తి కనపడుతోంది.

ఏమిటీ నరకం? అనుకున్నాడు జుట్టు పీక్కుంటూ—

7

రాత్రి — పదకొండు గంటలు దాటి పదినిమిషా లయ్యింది.

ఆ వరుసలో వున్న ఇళ్ళన్నీ నిద్రలోకి జారుకున్న ట్టుగా వున్నాయి.

అప్పటి వరకూ యేవో వ్యాపార సంబంధమైన ఎకౌంట్లు చూసుకున్న జనార్దనంకి నిద్ర ముంచుకువచ్చింది.

గోడకున్న గడియారంలో టైము చూసి గదిలోనించి బయటకు వచ్చి కంపౌండు హాలు పక్కనే నిలబడి బీడీ కాల్చుకుంటున్న కాన్‌స్టేబులు దగ్గరకు వెళ్ళి అతడిని పలకరించాడు.

"మీరు భయపడవలసింది యేమీలేదు సార్. కన్ను ముయ్యకుండా కాపలా కాస్తున్నాను. ఈ నాలుగు రోజులనించి ఈ వీధిలోకి రాత్రిపూట ఎవ్వరూ రాలేదు. తలుపులు బిగించుకొని హాయిగా పడుకుని నిద్రపోండి" అన్నాడు కాన్‌స్టేబుల్ కనకయ్య.

"నువ్వు అలా ధైర్యం చెబితే చాలు. ఎందుకైనా మంచిది—నువ్వు బాగా ఎలర్టుగా వుండు. అతను సాధారణమైన మనిషి కాదు. పగబట్టిన పాము. యేదోవిధంగా ఇంట్లోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తాడు. నువ్వు ఇక్కడ కాపలా వున్నావనే ధైర్యంతోనే నేను వెళ్ళి పడుకుంటున్నాను" అని లోపలకు వెళ్ళిపోయాడు జనార్దనం.

నవ్వుకున్నాడు కాన్‌స్టేబులు.

మనుషులకు ప్రాణభయం ఎక్కువగా వుండటం కూడా మంచిదే. అతడికి రోజూ ఉదయమే జనార్దనం నిద్ర

పోకుండా కాపలా వున్నందుకు బాగానే డబ్బులు ఇస్తున్నాడు.

'పాపం.... ఈ లక్షాధికారి ఎంత భయపడుతున్నాడో' అనుకున్నాడు.

తలుపులన్నీ బిగించి పడుకున్న అరగంటలోనే జనార్దనంకి గాఢమైన నిద్రపట్టింది.

అప్పటివరకు ఆ గదిలో వున్న పెద్ద బీరువా వెనకనే నిలబడి వున్న అతను చిన్నగా బయటకు వచ్చి—ప్రశాంతంగా నిద్రపోతున్న జనార్దనంని చూసి నవ్వుకున్నాడు.

జేబులోనించి చిన్న సీసా తీసి కర్చీఫ్ మీద అందులోని మత్తుమందును వంచి జనార్దనం ముక్కు దగ్గర కొంచెంసేపు వుంచాడు.

రెండు నిమిషాల తర్వాత అతడిని అటూ ఇటూ కదిలించాడు. కాని జనార్దనం కదలలేదు. అతడికి స్పృహ పోయిందని అనుకున్న తర్వాత జేబులోనించి నైలాన్ తాడును తీసి అతడిని బెడ్‌కేసి గట్టిగా బిగించాడు కొంచెం కూడా కదలటానికి వీల్లేకుండా.

తర్వాత అతడి నోటికి పూర్తిగా గమ్‌టేప్ అంటించాడు.

పది నిముషాలు గడిచాయి.

అప్పుడు మరో బాటిల్లోని ద్రవాన్ని జనార్దనంకి వాసన చూపించి స్పృహ తప్పించాడు.

చిన్నగా కళ్ళు తెరిచి యెదురుగా వున్న అతడిని చూసి భయపడిపోయాడు జనార్దనం. అరవబోయాడు. కాని సాధ్యం కాలేదు. చిన్నగా మూలిగాడు. కాని ఆ మూలుగు బయటకు రాలేదు.

"భయపడు....ఆ తర్వాత చావుకి సిద్ధపడు. బయట పోలీసు మనిషి కాపలావున్నా నీ సెల్ లోపలకి వచ్చానని ఆశ్చర్యపోతున్నావు కదూ? పగబట్టిన పామును ఎవ్వరూ ఆపలేరు జనార్దనం. నేనే నీ పాలిట మృత్యువుని. నా నించి తప్పించుకోటం నీకు సాధ్యం కాదు."

అతడి మాటలు వింటున్నప్పుడు జనార్దనం కళ్ళు భయంతో నిండిపోయాయి. తనని చంపవద్దంటున్నట్టు అతనికేసి ప్రాధేయపడుతున్నట్టు చూశాడు.

అతను నవ్వి, "నువ్వు దుర్మార్గుడివి....జాలి—దయ లేని మనిషివి....నీలాంటి నీచుడిని చంపకుండా వదలను. నీకు చావు తప్పదు....అయితే యిప్పుడే కాదు. నిన్ను హింసించి మరీ చంపుతాను...." అంటూ జేబులోనించి ఓ చిన్న సీసా తీశాడు.

దాన్ని చూడగానే భయంగా అటూ ఇటూ కదిలాడు జనార్దం.

అతను నవ్వుతూ ఆ బాటిల్ కు వున్న మూత తీసి అందులో వున్న యాసిడ్ ని జనార్దనం కుడిచేతిమీద వంచేశాడు.

అంతే. జనార్దం ఎగిరిపడ్డాడు.

యాసిడ్ అతడి చేతిని మొత్తం కాల్చివేసింది. బుస బుసమని పొంగింది. సన్నని పొగ పైకి లేచింది. చేతి మీది చర్మమంతా వుడికిపోయింది.

బాధతో విలవిల్లాడిపోయాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మొహంలో బాధ స్పష్టంగా అగుపడింది.

జనార్దనం మెలికలు తిరిగిపోవటాన్ని చూసి నవ్వాడు అతను.

"ఎలావుంది జనార్దనం? బావుందా? బాగా బాధగా

వుందా? అవును ...అలాగే వుంటుంది....నువ్వు ఈ గాయంనించి కోలుకునే లోపలే నిన్ను అంతం చేస్తాను....చావు కోసం యెదురుచూస్తుండు" అంటూ చిన్నగా తలుపు తెరుచుకుని బయటకు వెళ్ళిపోయాడు అతను.

ఇంకా జనార్దనం చెయ్యి కాలుతూనే వుంది.

అతను ఇంటి వెనకవైపున వున్న గోడమూకి సందులో నించి చీకట్లో కలసిపోయాడు.

8

"మైగాడ్....ఎంత ఘోరం జరిగిపోయింది! ఇంత దారుణం జరుగుతుంటే మా కానిస్టేబులు ఏం చేస్తున్నాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఆగన్ రావటంతోనే—

బాధగా కళ్ళు తెరిచాడు జనార్దనం.

"సారీ....బయట పోలీసుమనిషి కాపలా వున్నా ఆ ఇడియట్ వచ్చి మిమ్మల్నిలా బాధ పెడతాడని నేను కల్లో కూడా వూహించలేదు...."

"చెయ్యి చాలా ఘోరంగా కాలిపోయింది. చాలా శక్తివంతమయిన యాసిడ్‌ను వుపయోగించాడు ఆ వ్యక్తి. ఇంకా నయం మొహంమీద చల్లలేదు. గొప్ప ప్రమాదం తప్పిపోయింది" అన్నాడు డాక్టరు నిరంజనం.

రూప అక్కడే వున్న కుర్చీలో కూర్చుని సన్నగా యేడుస్తోంది....దుఃఖంతో ఆమె గుండెలు యెగిరిపడుతున్నాయి.

"ప్లీజ్....యేడవకండి....ఒక్కోసారి మనం నిమిత్తమాత్రులుగానే వుండిపోవాలనిపిస్తూ వుంటుంది....ఇక ఆ మనిషి మీ నాన్న దగ్గరికి రాకుండా అవసరమయిన చర్యలన్నీ తీసుకుంటాం....బాధపడకండి" అన్నాడు ఇన్

స్పెక్టర్—రూపను ఓదారుస్తూ—

"హు....ఏం పోలీసులు మీరు? పోలీసులు కాపాలా వున్నప్పుడే హంతకులు ఇలా తిరుగుతుంటే ఇంకా పోలీసులు ఎందుకు? ఇలా ఏడుస్తున్న మనుషులను ఓదార్చటానికా?" అన్నది రూప విసురుగా.

"మిస్ రూపా....మీ కోపం విషయాన్ని గుర్తించాలి. పోలీసులు కూడా మీలాంటి మనుషులే....కాని ప్రభుత్వం ఇచ్చిన కొన్ని బాధ్యతల దృష్ట్యా వాళ్ళు సాధారణమైన మనుషుల కంటె ధైర్యంగా వుంటారు. ఒక్కోసారి దొంగతనాలు—హత్యలు చేసే మనుషులు పోలీసుల కంటే తెలివైనవాళ్ళు—బలవంతులు వుంటారు. ఇప్పుడు అలాగే జరిగింది. ఆ మనిషి ఎవరో తెలివైనవాడు....అందుకే మా కానిస్టేబుల్ కళ్ళు కప్పి లోపల ప్రవేశించి మీ నాన్నను యిలా గాయపరిచాడు. వినా అసలు మనుషులు మాతో సహకరించకపోతే మేము ఏం చెయ్యగలం?" అన్నాడు విచారంగా.

"అంటే మీ ఉద్దేశం ఏమిటి?"

"ఆ వ్యక్తి మీ నాన్నమీద పగబట్టటానికి—హత్య చెయ్యాలని అనుకోటానికి ఏదో బలమైన కారణం వుండి వుండాలి. అదేదో నాతో చెబితే హంతకుడిని పట్టుకోవటం సులభమవుతుంది....కాని జనార్దనంగారు మాకు ఏమీ చెప్పటంలేదు" అన్నాడు.

"ఈ విషయమే ఆశ్చర్యంగా వుంది. నాన్నను ఈ విషయం గురించి నేను యెంతగానో అడిగాను. కాని ఆయన తనకు తెలిసి యే కారణమూ లేదని అంటున్నాడు ఇన్‌స్పెక్టర్."

"కాదు. నా అనుమానం ఆయన చెప్పటంలేదని....

ఏదో బలమయిన సంఘటన జరిగివుండనిదే ఓ మనిషి మరో మనిషిని చంపాలని అనుకోడు. అంత కసి అతడికి ఎందువల్ల యేర్పడింది.... అందుకు తగిన కారణమే వుండి వుంటుంది. కాని జనార్దనంగారు మనకు చెప్పటంలేదు" నిట్టూర్చాడు ఇన్‌స్పెక్టర్.

జనార్దనం అందరి మాటలూ వింటూనే వున్నాడు. అయినా అతడికి మాట్లాడే ఓపికలేదు. రాత్రి షాక్‌నించి అతను ఇంకా పూర్తిగా తేరుకోలేదు. అతడిలో భయం కొంచెం కూడా తగ్గలేదు. అందుకే మవునంగా వుండిపోయాడు.

"ఇంకో విషయం.... పారిశ్రామికవేత్త రాజన్‌గారికి ఆ మనిషి త్వరలోనే వచ్చి చంపుతానని ఓ బెదిరింపు ఉత్తరం కూడా రాశాడు. దాన్నిబట్టి అతను ఎంత సిన్సియర్‌గా వున్నాడో అర్థమవుతోంది. అతని ధ్యేయం ఒక్కటే అనుకుంటాను—ఈ యిద్దరినీ హత్య చెయ్యటం" చెప్పాడు జగన్.

9

అతను అక్కడే నిలబడి వున్నాడు. ఎక్కడంటే— మొదటిసారిగా అతను రాజన్ కోసం వచ్చినప్పుడు యే లైటు సంభం వెనుక వున్న నీడలో నిల్చున్నాడో— అక్కడే!

అప్పుడు కూడా సమయం పన్నెండు గంటలు కావస్తోంది. అతడి పాదాలకు చప్పుడు చెయ్యని మెత్తని బూట్లు వున్నాయి.

అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి.

జరిగినదంతా తల్చుకుంటే అతడి గుండె మండిపోతోంది.

దుర్మార్గులు....

ఇంకా వీళ్ళని బతకనివ్వకూడదు.

అతడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

ప్యాంటు జేబులోకి చేతిని పోనిచ్చి కత్తిని బయటకు తీశాడు. ఒక్కసారి దానికేసి చూసి "నీకు కొన్ని నిము షాల్లో ఆహారం దొరకబోతుంది" అన్నాడు తనలోతనే—

తర్వాత దాన్ని మళ్ళీ జేబులో పెట్టుకుని గోడ మీదుగా రాజన్ ఇంట్లోకి చూశాడు.

ఎదురుగా వున్న ముందు గదిలో ఇద్దరు మనుషులు కూర్చుని బాగా మందు కొడుతున్నారు.

ఆ ఇద్దర్లో ఒకడు—రాజన్ కొడుకు స్వరూప్. రెండోవాడు కిరాయి గూండా.

వాడిని స్వరూప్ తన తండ్రికి అంగరక్షకుడుగా తీసుకువచ్చాడు. పోలీసులమీద నమ్మకం పోవటంతో స్వరూప్ యీ ఏర్పాటు చేశాడు.

ఆ కిరాయిగూండా బాగా బలిసిన ఎద్దులా—సీమ పందిలా వున్నాడు. ఎత్తుగా పైకిలేచిన జుట్టు—చారల పట్టుతో భయంకరంగానే వున్నాడు. వాడు డబ్బు కోసం యే పనయినా చేస్తాడు. యెన్నోసార్లు జైలుకు కూడా వెళ్ళి వచ్చాడు.

ఇంతకీ వాడి పేరు వీరేశం.

వాడిని చూసి నవ్వుకున్నాడు అతను.

నిజానికి వాడితో తలపడి తాను గెలవలేడు. అందుకే వీలున్నంతవరకు వాడి కంట పడకుండానే తన పని ముగించుకోవాలి.

అందుకు వాడు బాగానే సహకరిస్తున్నాడు. మందు లేనిదే ఆ వీరేశం నిమిషం కూడా వుండలేడు.

స్వరూప్ కూడా వాడి మనసు తెలుసుకొని కావలసి నన్ని సీసాలను అక్కడ యేర్పాటు చేశాడు.

కాని పీకలవరకూ తాగితే మెదడు పనిచెయ్యదనీ— నిద్రపోవటమే జరుగుతుందని వాళ్ళిద్దరు మరచిపోయినట్టు న్నారు.

కొన్ని క్షణాలు నవ్వులతో—గ్లాసులు నింపుకోవ టంతో గడిచిపోయాయి.

కాని—మరి కొంత సమయం గడిచేసరికి యిద్దరూ సీసాలన్నీ ఖాళీ చేసి ఒకరిమీద ఒకరు పడి నిద్ర పోయారు.

అప్పుడు అతను నవ్వుకుని హుషారుగా ముందుకు నడిచి ఒక్క గెంతులో గోడదూకి లోపల ప్రవేశించాడు.

గబగబా మెట్లెక్కి పైకి చేరుకున్నాడు.

గదిలో నిద్రపోతున్నాడు రాజన్.

తలుపులను నెట్టిమాశాడు. లోపల బోల్టు వేసి వున్నాయి.

ఒక్క నిముషం అక్కడే నిలబడి అటూ యిటూ చూశాడు. అతనికి చువ్వలు లేని పొడుగాటి అద్దాల తలుపులున్న కిటికీలు కనిపించాయి.

వాటి దగ్గరగా నడిచాడు. జేబులోనించి అద్దాలను కోసే రవ్వను తీశాడు.

ఐదు నిముషాల తర్వాత ఓ అద్దాన్ని కోసి చప్పుడు అవకుండా తీశాడు.

క్షణంలో ఆ గదిలోకి వెళ్ళాడు అతను.

నిద్రలో రాజన్ గుండె ఎగిరిపడుతోంది. హాయిగా నిద్రపోతున్నాడు—బయట తనని కాపాడే కిరాయి గూండా వున్నాడనే ధైర్యంతో—

కాని అతడి యెదురుగా యిప్పుడు ప్రత్యూవు నిలబడి వున్నది.

అతను జేబులోనించి కత్తిని బయటకు తీశాడు. సన్నగా పడుతున్న దీపం కాంతిలో తళతళమని మెరిసింది పదునైన కత్తి—అది వేడివేడి రక్తంకోసం ఎదురు చూస్తున్నట్టు వుంది.

ముందుకు వొంగాడు.

చటుక్కున రాజన్ నోటిని అరచేత్తో మూశాడు—

ఉలిక్కిపడి పళ్ళు తెరిచాడు రాజన్—

ఎదురుగా—యముడిలా అతను.

అతని చేతిలో విసురుగా పైకి లేచిన పొడుగాటి కత్తి.

రాజన్ పెద్దగా ఆర్తనాదం చెయ్యబోయాడు భయంతో—

కాని—అతని ఆర్తనాదం బయటకు రాకముందే విసురుగా పైకిలేచిన కత్తి అతడి గుండెలోకి పిడివరకు దిగిపోయింది.

ఒకే ఒక్క పోటు—

రాజన్ అరవకుండానే—చిన్న మూలుగుతో తల వాల్చేశాడు. అతడి ప్రాణం ఎటో ఎగిరిపోయింది.

నెత్తురు విసురుగా పైకి చిమ్మింది.

క్షణం తర్వాత అతను కత్తిని బయటకు లాగి రాజన్ కప్పుకున్న దుప్పటికి నెత్తురును పూర్తిగా తుడిచి "రాజన్....ఇప్పుడు నా తండ్రి ఆత్మ శాంతిస్తుంది" అని రాజన్ గొంతువరకు దుప్పటి కప్పి కత్తిని ప్యాంటు జేబులో పెట్టుకుని బయటకు వచ్చాడు.

గోడ దూకుతుంటే ముందు గదిలో రాజన్ ప్రాణా

లను కాపాడటానికి వచ్చిన కిరాయి గూండా గురక విన పడుతోంది అతనికి—

10

"ఇప్పుడు టైమెంతయ్యింది?" అడిగాడు కానిస్టేబులు డ్యూటీలో వున్న నర్స్‌ని.

"ఎందుకు? టైముతో నీకేమిటి పని? నిద్రవస్తోందా?" అన్నది నర్స్ నవ్వుతూ—

"నిద్రా....ఎదురుగా నువ్వు కనపడుతుంటే నిద్ర వస్తుందా నర్సమ్మా...." అన్నాడు చిలిపిగా కానిస్టేబులు అన్నారావు.

ఇన్‌స్పెక్టర్ జగన్—కావాలని అన్నారావు బాగా డ్యూటీ చేస్తాడని హాస్పిటల్లో జనార్దనంకి కాపలా వుంచాడు.

అన్నారావు బాగానే డ్యూటీ చేస్తాడు కాని— అతనికి వయసులో వున్న ఆడదాన్ని చూస్తే మనసు నిలవదు.

నర్స్ నవ్వి "పోలీసు ఉద్యోగమంటే కాపలా కాయటమేనా జీవితాంతం?" అని అడిగింది.

"అవును. నీలాంటి అందమైన నర్స్‌లను చూస్తూ జీవితాంతం కాపలా కాయటం అంత కష్టమైన పనికాదు...." అన్నాడు కన్ను గీటుతూ—

ఆ సమయంలో వాళ్ళిద్దరే అక్కడ మెలకువగా వున్నారు.

"అంత అందంగా వున్నానా నీ కళ్ళకు?"

"నా కళ్ళకే కాదు....అందరి కళ్ళకి నువ్వు అందంగానే వుంటావు. ముందు టైమెంతయ్యిందో చెప్పు...." అన్నాడు.

కుడిచేతికి వున్న వాచీ చూసుకుని "ఒంటిగంట దాటు తోంది" అన్నది.

"ఒంటిగంటా....అయితే ఇక ఇవ్వాల్టికి జనార్దనం గారికి ఎలాంటి ప్రమాదమూ లేదు" అన్నాడు.

"అదేమిటి?" అన్నది నర్స్.

"అదంతే....ఎక్కువగా హత్యలన్నీ రాత్రి ఒంటి గంట లోపలే జరుగుతూ వుంటాయి. ఇదొక రూలు. తర్వాత హంతకులైనా నిద్ర పోవాలి కదా?....అందు వల్ల నువ్వు ముందు వెళ్ళి జనార్దనంగారు ఎలా వున్నారో ఒకసారి చూసిరా" అన్నాడు సిగరెట్టు ముట్టిస్తూ రక్షక భటుడు.

నర్స్ వెళ్ళి రెండు నిముషాల్లోనే తిరిగివచ్చి "ఆయన నువ్విక్కడ కాపలా వున్నావనే ధైర్యంతోనే బాగా నిద్రపోతున్నాడు....తలుపులు మూసి బయట గడియ పెట్టి వచ్చాను" అన్నది.

"గడుసుదానివే....అయితే పద" అన్నాడు కానిస్టే బులు.

"ఎక్కడికి?" అన్నది ఆమె కొంటెగా నవ్వుతూ.

"మన ప్రణయ సామ్రాజ్యాన్ని ఏలటానికి." అన్నా డతను ఆమె భుజంమీద చెయ్యివేసి.

ఒక్క నిమిషంలో వాళ్ళిద్దరు ఆ హాస్పిటల్ వెనుక వైపుకు వెళ్ళిపోయారు.

అప్పటివరకూ గోడదగ్గర నిల్చున్న అతను వాళ్ళటు వెళ్ళగానే గోడ మూకి లోపలకు వచ్చాడు—మాటువేసిన పులిలా.

వరండాలో కొంచెం దూరం నడిచి గడి వేసివున్న

తలుపుల ముందు ఆగిపోయాడు.

అతని షర్టుమీద, ప్యాంటుమీద నెత్తురు మరకలు వున్నాయి. అతడి జుట్టు చిందర వందరగా వుంది.

గడియతీసి తలుపులు తెరిచి పిల్లిలా లోపలకు నడిచాడు.

వెల్లకింతలా పడుకుని నిద్ర పోతున్నాడు జనార్దనం.

నిమిషంసేపు అతడికేసి చూశాడు.

వెంటనే అతడిచేతిలో తళతళ మెరిసే కత్తి ప్రత్యక్షమయ్యింది.

ఒకచేతో జనార్దనం నోరునొక్కి విసురుగా కత్తిని అతడి గుండెల్లోకి దించేశాడు పిడివరకు—

ఒక్క పోటు—

జనార్దనం ప్రాణం నిద్రలోనే గాల్లో కలిసిపోయింది....

"ఈ హత్య నా తల్లి ఆత్మ శాంతికోసం" అని కత్తి తీసి అతడికూడా గొంతువరకు దుప్పటి కప్పి బయటకు వచ్చేశాడు అతను తలుపులను మూసి గడియపెట్టి—

11

తెల్లవారింది—

ఒకే రాత్రి.... రెండు హత్యలు.

నగరంలో ఈ వార్త గొప్ప సంచలనాన్ని లేవదీసింది. ఇన్‌స్పెక్టర్ జగన్‌కు ఐతే నిజంగా మతిపోయింది.

ఆ మనిషి యింత అర్జంట్‌గా ఒక్క రాత్రిలోనే రెండు హత్యలను అవలీలగా చేస్తాడని కొంచెం కూడా వూహించలేదు.

రెండు శవాలనూ మార్చురీకి పంపించాడు జగన్.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది.

రెండు హత్యలూ ఒకే కత్తితో, ఒకే విధంగా జరిగాయి.

హంతకుడు తనని పట్టుకోటానికి అవసరమయిన యే ఒక్క ఆధారాన్నీ వదలకుండా వెళ్ళిపోయినందుకు ఇన్స్పెక్టర్‌కి ఎంతో విచారం కలిగింది.

మొత్తానికి అతను తన పగ సాధించాడు.

సాయంత్రం నాలుగు గంటలకు ఇన్స్పెక్టర్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళేసరికి అతడికోసం యెదురుచూస్తూ ఓ మనిషి కూర్చుని కనిపించాడు.

"ఎవరు మీరు? ఏం పనిమీద వచ్చారు?" అని అడిగాడు విసుగ్గా.

అతను అదోలా నవ్వి "నా పేరు విద్యాసాగర్. రాజన్‌నీ—జనార్దనంనీ హత్యచేసిన మనిషి నేనే.... నా అంతట నేనే మీకు లొంగిపోవాలని వచ్చాను" అన్నాడు ఎంతో సౌమ్యంగా.

ఆ మాటలు వినగానే కుర్చీలో పెద్ద బాంబు పేలినట్టు ఎగిరిపడ్డాడు ఇన్స్పెక్టర్ జగన్.

ఆశ్చర్యంగా అతడికేసి చూశాడు.

సన్నగా—పొడుగ్గా వున్నాడు. నీటుగా దువ్వుకున్న జుట్టు....నిర్మలంగా వున్న కళ్ళు.

"ఏమిటీ....మీకేమైనా మతిపోయిందా? లేకపోతే జోక్ చేస్తున్నారా?" అని అడిగాడు జగన్.

"మతిపోలేదు. మతి సరిగా వుండబట్టే ఆ రాక్షసులిద్దరినీ చంపగలిగాను. ఇది నిజం. ఇదిగో చూడండి, ఈ కత్తితోనే ఆ ఇద్దరి గుండెల్లో పొడిచి చంపాను" అంటూ ప్యాంటు జేబులోనించి పొడుగాటి కత్తిని తీసి

ఇన్‌స్పెక్టర్‌కు చూపించాడు.

అప్పుడు జగన్ నమ్మక తప్పలేదు.

"మీరు ఎందుకీ హత్యలు చేశారు?" అన్నాడు నిమిషం తర్వాత.

"చెబుతాను. నిజానికి ఆ ఇద్దరినీ ఎందుకు హత్య చేసిందీ వాళ్ళకు కూడా చెప్పలేదు. నేనెవరో వాళ్ళకు తెలీను కూడా — బహుశా వాళ్ళు చేసిన ఘోరాలను వాళ్ళు యెప్పుడో మరచిపోయి వుండాలి. ఇక నా కథ చెబుతాను.

నా తండ్రి ఉదయగిరి జమీందారు దగ్గర పనిచేసే వాడు. ఒకసారి యెవరో కొంతమంది దుండగులు ఆ ఆ జమీందారును హత్యచేసి ఆయన దగ్గర వున్న ఎంతో విలువైన వజ్రాల్ని దోచుకున్నారుట. ఆ మనుషుల్లో నా తండ్రి కూడా వున్నాడనే వదంతి బయటకొచ్చింది.

ఈ విషయం తెలిసిన మా నాన్న నన్ను మా అమ్మను తీసుకొని ఉదయగిరినించి పారిపోయాడు. ఆ రాత్రి మేము ఓ పాడుబడిన ఇంట్లో పడుకున్నాము.

ఒక రాత్రివేళ నాకు మెలకువ వచ్చి చూస్తే మా అమ్మ—నాన్న కనిపించలేదు. అప్పుడు నా వయసు ఏడేళ్ళు. ఎంత వెతికినా వాళ్ళు ఏమయ్యారో అర్థం కాలేదు. బహుశ జమీందారు మనుషులు వాళ్ళను ఎత్తుకుపోయి వుంటారని అనుకున్నాను.

ఆ తర్వాత నేను గాలికి పెరిగాను. చిన్న చిన్న పనులు చేసుకుంటూ డబ్బులు సంపాదించి చదువు కున్నాను. ఐనా నిరంతరం నేను నా తల్లిదండ్రుల కోసం వెతుకుతూనే వున్నాను.

నా అదృష్టం. నెల రోజుల క్రితం ఈ ఊళ్ళోనే

చావు బతుకుల్లో వున్న నా తల్లి కనపడింది. నేనెంతో సంతోషపడిపోయాను. ఆమె జరిగిన కథనంతా కన్నీళ్ళతో నాకు చెప్పి నా ఒడిలోనే కన్ను మూసింది. ఆమె యేనాటికయినా నేను కనపడతాననీ తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకొనేలా చెయ్యాలనే బతికి వుంది.

మా అమ్మ నాకు జరిగిన కథనంతా చెప్పింది. రాజన్ తన మనుషులతో వచ్చి మా నాన్నను అమ్మను బంధించి తీసుకుపోయి యెక్కడో రహస్యంగా దాచి, మా నాన్నను ఆ జమీందారు దగ్గర దొంగిలించిన వజ్రాలు ఎక్కడ దాచావో చెప్పమని హింసించాడుట. తనకే పాపమూ తెలీదన్నాడుట మా నాన్న. కాని ఆ దుర్మార్గుడు వినకుండా మా అమ్మను—నాన్నను ఎన్నో చిత్ర హింసలు పెట్టాడుట. చివరకు ఆ హింసలతోనే మా నాన్న చనిపోయాడుట.

మా అమ్మ ఎలాగో అక్కడినించి తప్పించుకొని కొన్నాళ్ళ తర్వాత అక్కడా అక్కడా పనులు చేసుకొని బతుకుతూ చివరకు జనార్దనం ఇంటికి చేరిందట. ఆ నీచుడు ఒకరోజు యెవ్వరూ లేని సమయం చూసి ఆమెను బలవంతంగా పశువులా నాశనం చేశాడుట.

నా తల్లి చెప్పినదంతా వినగానే నాలోని రక్తమంతా సలసల మరిగిపోయింది. నా తల్లిదండ్రులకు అంత ఘోరమైన అన్యాయం చేసిన ఆ ఇద్దరినీ ఆ క్షణంలోనే చంపాలనుకున్నాను. నా తల్లి కూడా ఆ ఇద్దరిమీదా పగ సాధించమని చెప్పి కళ్ళు మూసింది. అందుకే ఆ నర రూప రాక్షసులను ఘోరంగా నా కత్తిపోటుకు గురిచేసి చంపాను.

నా మనస్సాక్షికి నేను నిర్దోషి నే ఐనా చట్టం దృష్టిలో నేను నేరస్థుడిని. నన్ను మీరు పట్టుకోలేరని నాకు తెలుసు.

నా పగ చల్లారింది. ఇక నాకు ఈ ప్రపంచంలో నా మనుషులంటూ యెవ్వరూ లేరు. అందువల్ల నా బ్రతుకును గురించి నాకు దిగుల్లేదు. జీవితంమీద ఆశ లేదు. బహుశా నాకు ఉరిశిక్ష పడుతుందని అనుకొంటాను. ఉరి కంబం ఎక్కటానికి నేను సిద్ధంగానే వున్నాను" అన్నాడతను వస్తున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ.

—: అ యి పో యిం ది: —